ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలందరి ఆరోగ్యానికి రక్షగా నిలిచేది 'జగనన్న ఆరోగ్య సురక్ష' అని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విద్యాధరపురం 45వ డివిజన్ పరిధిలోని కబేళా రోడ్డులో గల వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం(అర్బన్ హెల్త్ సెంటర్) వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన నగర మేయర్ భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులతో వారు మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో ఏడు రకాల పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా మందులను అందజేస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు కూడా మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇంటి ముంగిటకే వైద్య సేవలను తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

బాబు అవినీతికి పాల్పడలేదని చెప్పగలరా?

చంద్రబాబు అవినీతికి పాల్పడ లేదని ఆయన సతీమణి భువనేశ్వరి గాని, కుమారుడు లోకేష్‌గానీ, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ గానీ చెప్పగలరా అంటూ ఎమ్మెల్యే వెలంపల్లి సవాల్ విసిరారు. చివరికి కోట్లాది రూపాయల ఫీజులు తీసుకునే చంద్రబాబు లాయర్లు కూడా చెప్పలేక పోవడం గమనార్హమన్నారు. స్కిల్ స్కామ్‌లో సాక్ష్యాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు కోసం టీడీపీ నాయకులు యాత్రలు చేసినా ప్రయోజనం శూన్యమన్నారు. చంద్రబాబు అరెస్ట్ పట్ల ప్రజల్లో స్పందన లేదని తెలిసి కూడా ఇంకా పాకులాడటం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. స్వలాభం కోసం దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ దేనికైనా సిద్ధమనే రీతిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పవన్ పార్టీని పెట్టిందే చంద్రబాబు కోసమని, 2014లో కలిసి పోటీ చేయడం, 2019లో విడివిడిగా పోటీ చేయడం, చివరికి ఇప్పుడు మళ్లీ కలిసి పోటీ చేస్తామనడం పవన్ రాజకీయ అజ్ఞానానికి తార్కాణమని చెప్పారు.



మెడికల్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, మాధురి లావణ్య తదితరులు

పేదరికం వైద్యానికి అడ్డుకాకూడదన్నది లక్ష్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ఖరీదైన వైద్యానికి పేదరికం అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేశారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమంలో భాగంగా 53వ డివిజన్ పరిధిలోని సచివాలయాల ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో, 54వ డివిజన్ సచివాలయాలకు సంబంధించి వించిపేట మహ్మదాలీపురం వీఎంసీ పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాలను ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని జగనన్న అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమం పేరుతో రాష్ట్ర వ్యాపితంగా ప్రతి ఒక్కరికి చేరే విధంగా దీనిని ముందుకు తీసుకెళ్తున్నారని వివరించారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో ఈ శిబిరాలు జరుగుతాయన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, ఆర్షద్, శ్రీశైలం దేవస్థానం పాలకవర్గ సభ్యుడు గురుమహంతు మహేష్, నాయకులు ఎన్ జ్యోతి, అతీక్ స్థానిక కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు పాల్గొన్నారు.

భారీగా తరలివచ్చిన స్థానిక ప్రజానీకం

పాతబస్తీలోని కొత్తపేట కేబీఎన్ కళాశాల, వించిపేట వీఎంసీ హైస్కూల్ ప్రాంగణాల్లో నిర్వహించిన వైద్య శిబిరానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. ప్రధానంగా వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులు సేవలందించారు. ప్రజలకు అవసరమైన మందులను సైతం అందించారు.

వైఎస్సార్ కాలనీలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బుధవారం రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, ఎంపీటీసీ బయ్యారపు కల్పన, వైఎస్సార్ సీపీ మాజీ మండలాధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్, ఫరీఫ్, డీఎల్ రాజు తదితరులు పాల్గొన్నారు. వైద్యం ఖరీదైన ప్రస్తుత తరుణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఏడు రకాల పరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులను కూడా ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వైద్యరంగానికి పెద్ద పీట వేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.



నేత్ర పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి



జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

క్లుప్తంగా

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కరకట్ట సమీపంలోని శ్రీ భవానీ దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారి ఊరేగింపు వైభవంగా సాగింది. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని దేవస్థానం నుంచి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకుడు దంటు భవానీశర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. దేవస్థాన నిర్వాహకులు, ఉభయదాతలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో అన్నప్రసాద వితరణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత ఆలయ ప్రాంగణంలో ముత్తైదువులను అమ్మవారి ప్రతిరూపాలుగా భావించి అన్న ప్రసాదాలను కమిటీ ప్రతినిధులు అందజేశారు. దేవస్థాన కల్యాణ మండపంలో ఉభయ దాతలకు, భక్తులకు అన్నప్రసాదాలను కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, గౌరవ అధ్యక్షుడు బెవర సూర్యనారాయణలు ప్రారంభించారు. దసరా ఉత్సవాల అనంతరం ప్రతి ఏటా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు మరుపిళ్ల సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి దుర్గాప్రసాద్, శీరం వెంకట్రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లి, బిడ్డ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నాలుగేళ్ల బిడ్డతో తల్లి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పటల్ ప్రాంతానికి చెందిన నేతల గ్రేస్‌మణి(23) భర్తతో విభేదాల కారణంగా కొంతకాలంగా ఆమె తన పెద్దమ్మ లలిత వద్ద ఉంటుంది. గ్రేస్‌మణి మాచవరం డౌన్‌లోని ఓ హాస్పిటల్‌లో స్వీపర్‌గా పని చేస్తుంది. మంగళవారం డ్యూటీ నుంచి ఆలస్యంగా వచ్చిన గ్రేస్‌మణిని పెద్దమ్మ లలిత మందలించింది. దీంతో అర్ధ రాత్రి రెండు గంటల సమయంలో గ్రేస్‌మణి తన నాలుగేళ్ల బాబు రిషిని తీసుకుని ఇంటిలో నుంచి బయటకు వెళ్లిపోయింది. లలితకు ఇంట్లో గ్రేస్‌మణి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆటో ఢీ కొని బాలుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటో ఢీ కొనడంతో బాలుడికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నైనవరం సుందరయ్యనగర్‌కు చెందిన జే జయసూర్య 9వ తరగతి చదువుతున్నాడు. చిన్నతనంలోనే జయసూర్య తల్లి చనిపోవడంతో పెద్దనాన్న ఏసేబ్ వద్దే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం వైవీఆర్ చికెన్ షాపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. దీంతో జయసూర్యకు గాయాలు కాగా, తిరిగి ఆటో డ్రైవర్ జయసూర్యను దూషించాడు. దీంతో స్థానికులు జయసూర్య అన్నయ్యకు ఫోన్ చేయడంతో హుటాహుటిన బీఆర్‌టీఎస్ రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో కేసు నమోదు చేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వెళ్లిన తన భార్య కనిపించడం లేదంటూ భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేట 35 గజాల ప్రాంతానికి చెందిన మామిడి లక్ష్మి, రామకృష్ణ భార్యభర్తలు. వీరికి 7 ఏళ్ల కిందట వివాహం కాగా, రామకృష్ణ ముఠా పని, లక్ష్మి హోటల్‌లో స్వీపర్‌గా పని చేస్తున్నారు. మంగళవారం పనికి వెళ్లిన లక్ష్మి సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో రామకృష్ణ భార్య కోసం హోటల్‌లో ఆరా తీయగా, పనికి రాలేదని తెలిసింది. దీంతో తన భార్య కనిపించడం లేదంటూ రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యువకుడిపై కత్తితో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట సుబ్రహ్మణ్య స్వామి వారి గుడి ప్రాంతానికి చెందిన గంప ప్రభు చేపల మార్కెట్‌లో కోళ్ల వ్యాన్‌లో పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి ప్రభు, బుడ్డా ఏసు అనే వ్యక్తి కలిసి మద్యం తాగే సమయంలో గొడవ జరిగింది. బుధవారం మధ్యాహ్నం చేపల మార్కెట్ వద్ద ఉన్న ప్రభుతో ఏసు మళ్లీ గొడవ పడ్డాడు. ఆ సమయంలో చికెన్ షాపులో ఉన్న కత్తి తీసుకున్న ఏసు, ప్రభుపై దాడి చేయబోయాడు. దీంతో ప్రభు తన ఎడమ చేయిని అడ్డు పెట్టగా, చేతిపై గాయమైంది. గాయపడిన ప్రభు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వన్‌టౌన్ పీఎస్‌లో శాస్త్రోక్తంగా చండీహోమం



అన్నదానం చేస్తున్న సీపీ టీకే రాణా, పోలీస్ అధికారులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి, సీపీ రాణా, డీసీపీ విశాల్‌గున్ని, ఈవో రామారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో బుధవారం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో కలశాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. ముగింపు సందర్భంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా పలువురు ఐపీఎస్ అధికారులు స్వయంగా హాజరై పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయుధ పూజలు, అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పోలీసు కమిషనర్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీపీ, పోలీసు కుటుంబాలు, వేలాది మంది పేదలు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎమ్మెల్యే వెలంపల్లి, సీపీ రాణా, నగరంలోని జాయింట్ సీపీ, డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, అధికారులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక సీఐ సురేష్‌రెడ్డి, ఏసీపీ కే హనుమంతరావులు కార్యక్రమాలను నిర్వహించారు. ఏఐజీఎం రవీంద్రబాబు, డీసీపీ విశాల్‌గున్ని, ఏడీసీపీలు సీహెచ్ లక్ష్మీపతి, పి.వెంకటరత్నం, ఆలయ ఈవో కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేశారు : సీపీ

అన్ని శాఖల సమన్వయంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేశామని సీపీ టీకే రాణా అన్నారు. పూజల అనంతరం ఆయన సిబ్బందిని అభినందించారు. దసరా వేడుకలకు సుమారు 15 లక్షల మంది భక్తులు తరలివచ్చారని చెప్పారు. 11 రోజుల పాటు రద్దీ కొనసాగిందన్నారు. 3 వేల మంది సిబ్బందితో తమ శాఖ బందోబస్తు చేపట్టిందని వివరించారు. అనంతరం వన్‌టౌన్ పోలీసుసిబ్బందితో పాటుగా అధికారులతో కలిసి ఫొటో దిగారు.

పోలీసు శాఖ సేవలు అభినందనీయం : వెలంపల్లి

దుర్గమ్మ దసరా వేడుకల్లో పోలీసు శాఖ చక్కని సేవలందించిందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేశారన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవదాయ, పోలీసు, రెవెన్యూ ఇతర శాఖలు సమన్వయంతో ముందుకు సాగాయన్నారు. అలాగే తిరుమల తిరుపతి ఉత్సవాల స్థాయిలో ఈ ఏడాది దసరా ఉత్సవాలు జరిగాయని, విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

తుది దశకు అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరం నడిబొడ్డున అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం కమిషనర్ అధికారులతో కలిసి అంబేడ్కర్ స్మృతివనాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మ్యూజియం, సీలింగ్, ప్లాస్టింగ్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని చేయాలని ఆదేశించారు. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ జుబిన్ సిరేన్ రాయ్, కేపీసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.అనిల్‌కుమార్, మేనేజర్ కె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



స్మృతివనం పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ ఐరన్ మార్కెట్ యార్డ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని కరెంట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న పాత ఎంఐజీ బ్లాకులు, ఎల్ఐజీ బ్లాకులు, ఐరన్ యార్డ్, రిలయన్స్ పక్కనగల పటమటవారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఎఫ్ఎల్‌సీ పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి వారం నిర్వహించే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో భాగంగా గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఈవీఎం గోడౌన్‌లో ఎఫ్ఎల్‌సీ ప్రక్రియపై బుధవారం వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు 1,605 బ్యాలెట్ యూనిట్లు, 1,605 కంట్రోల్ యూనిట్లు, 1,695 వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. ఈ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తున్నామన్నారు. ఫస్ట్ లెవెల్ చెకింగ్‌ను ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు 285 యూనిట్ల చొప్పున 20 రోజుల పాటు 5,700 పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



గొల్లపూడి గోడౌన్ వద్ద కలెక్టర్ ఢిల్లీరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

నవంబర్ 24న శ్రీశైలంలో అన్నదాన సత్రం ప్రారంభోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీశైలంలో నిర్మిస్తున్న నగరాల నిత్యాన్నదాన సత్రం నవంబర్ 24వ తేదీన ఘనంగాప్రారంభిస్తున్నట్లు విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి చెప్పారు. శ్రీశైలంలో నగరాల సత్రం ప్రారంభోత్సవ వివరాల ఆహ్వాన పత్రికను కొత్తపేటలోని కొరగంజి ఎంక్లేవ్‌లో ఉన్న శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల నగరాలు కులస్తుల నిత్యాన్నదాన వసతి సత్రం కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఆహ్వాన పత్రికను మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సతీమణి శ్రీవాణితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరాల కులస్తులకు ఎంతో సహాయ సహకారాలను అందజేశారని కొనియాడారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీశైలంలో నగరాల సత్రం నిర్మాణానికి నాటి దేవదాయ శాఖ మంత్రి హోదాలో అర ఎకరం స్థలాన్ని కేటాయించడం ద్వారా తమ చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు.

9 నెలల్లో సత్రం ఫస్ట్ ఫేజ్ నిర్మాణం పూర్తి

అన్నదాన సత్రం కమిటీ ఫౌండర్, ప్రధాన కార్యదర్శి కొరగంజి జగన్నాథరావు మాట్లాడుతూ.. 9 నెలల్లో సత్రం ఫస్ట్ ఫేజ్ నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. తొలుతగా జ్యోతి ప్రజ్వలన, పూజా కార్యక్రమం శ్రీముఖ గ్రహీత శ్రీ గణపతి స్వామీజీ నిర్వహించారు. భవన నిర్మాణ దాతలైన మహిళలకు పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు, ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో నగరాల అన్నదాన వసతి సత్రం భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పోతిన వెంకటేశ్వరస్వామి, పిళ్లా రవి, లింగిపిల్లి అప్పారావు, బంక హనుమంతరావు, లింగిపిల్లి రామకృష్ణ, బాయన శేఖర్‌బాబు, పోతిన వరప్రకాష్, పిళ్లా విజయ్ కుమార్, పిళ్లా మోహనరావు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి సతీమణి శ్రీవాణి తదితరులు

కాపాడమ్మా.. దుర్గమ్మ



ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భవానీలు, భక్తులతో బుధవారం ఇంద్రకీలాద్రి భక్తజనకీలాద్రిగా మారింది. భవానీలు అమ్మవారిని దర్శించుకుని దీక్ష విరమణ చేశారు. కాపాడమ్మా.. దుర్గమ్మ అంటూ ప్రార్థించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీల దీక్ష విరమణ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన భక్తులు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పుష్కర్ ఘాట్, సీతమ్మవారి పాదాలు ప్రాంతంలో పర్యటిస్తూ ఘాట్ వద్ద యాత్రికులు స్నానం చేసేందుకు గల సదుపాయాలు, కేశఖండనశాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా ప్రాంత పరిసరాలన్నీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవానీల దీక్ష విరమణ సమయంలో వారు వదిలేసే వస్త్రాలను ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ ద్వారా తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఘాట్ల వద్ద మెరుగైన పారిశుద్ధ్య పరిస్థితులను నెలకొల్పి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీఎంఓహెచ్ డాక్టర్ రత్నావళి, హెల్త్ ఆఫీసర్–3 ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.